# నా స్వప్నమే నే కోరుకున్న

**కళ**

కళ్ళముందు కనిపిస్తున్నది నిజమా? భ్రమా? అనే అనుమానంతో మళ్ళీ మరోమారు అటువైపు చూశాడు కృష్ణ.

"సంయుక్త"

నిజమే... సంయుక్త అక్కడ వుంది. రద్దీగా వున్న ప్లాట్‌ఫాం మీద ఒక పక్కగా వున్న విజిటింగ్ రూం దగ్గర కూర్చుని ఏదో పుస్తకం చూస్తూ వుంది. దగ్గరికి వెళ్ళి పిలిచాడు కృష్ణ.

ఆ పిలుపు విని తల పైకెత్తి చూసిన సంయుక్త పరిస్థితి కూడా కృష్ణలాగా తయారయిందని ఆమె తత్తరపాటే తెలుస్తుంది.

పైకి లేచి నిలబడి అంది ఆనందం స్వరంలో వుట్టి పడుతుండగా—

"కృష్ణా... నువ్వు... ఇక్కడ... ఇలా..." మాటలు ఇక రానట్టు ఆగిపోయింది.

"అదే నేనూ అడుగుతున్నాను. నీవేంటి? ఇక్కడ ఇలా ఏమిటి?..." నవ్వుతూ అడిగాడు కృష్ణ.

"స్నేహితురాలి పెళ్ళికి వచ్చాను. నిన్న రాత్రి పెళ్ళి అయిపోయింది. ఇపుడు ట్రైన్‌కోసం ఎదురు చూస్తున్నాను..."

"ఓ ఫ్రెండ్ వూరు వెడుతుంటే స్టేషన్‌కి వచ్చాను. రావడం మంచిదయిందన్న మాట."

"అవును..." అంది సంయుక్త నవ్వుతూ.

సంయుక్త నుదుటన పెట్టిన కుంకుమని చూస్తూ అడిగాడు కృష్ణ.

"మీ ఆయన ఎలా వున్నారు...?"

"బాగానే వున్నారు. పెళ్ళికి రావడానికి సెలవు దొరకలేదు. అందుకే నొక్కదాన్నీ రావలసి వచ్చింది... మీ ఆవిడ ఎలా వుంది? పిల్లలా?"

"బాగానే వుంది. డెలివరీకి పుట్టింటికి వెళ్ళింది..."

పైకి మాటలు వారి మధ్య జరుగుతున్నా... ఇద్దరిలోనూ ఏదో దిగులు, మరేదో వెలితి. ఆ వెలితి తమ మధ్య ఈ జన్మలో తీరదు. ఇన్నాళ్లకు కలుసుకున్నారు. కానీ... అది తాత్కాలికం.

కొన్ని గంటల తర్వాత ఎవరికెవరో ఒకరిని తలుచుకుంటూ మరొకరు భారంగా కాలం గడపాలి.

అకస్మాత్తుగా అన్నాడు కృష్ణ.

"సంయూ... ఈ రోజుకి ఇక్కడే ఉండకూడదా?"

అనుకోకుండా అతని గుండె పొరల్లోంచి దూసుకు వచ్చింది ఆ మాట.

"ఉండటమా?... ఎలా?..."

పెద్దవి చేసిన ఆమె కళ్ళలో ఆశ్చర్యం తొంగిచూసింది.

"అవును సంయూ... మళ్ళీ ఎన్నాళ్ళకు కలుసుకుంటామో. ఈ ఒక్కరోజు మనం మళ్ళీ పాత రోజులను గుర్తుచేసుకుంటూ సరదాగా గడుపుదాం. ఏమంటావ్ ఉండు సంయూ రేపు తప్పకుండా వెళ్లిపోదువు గానీ..."

అతని గొంతులో సంయుక్తతో మరికొన్ని గంటలు గడపాలనె కోరిక, ఆమె అందుకు ఒప్పుకోవాలనే ఆశ కన్పిస్తున్నది.

కొన్ని క్షణాల తర్వాత అంది ఆమె.

"సరే..."

కొద్దిసేపటికి కృష్ణతో కలిసి అతని ఇంటికి వచ్చింది సంయుక్త.

ఎన్నోసార్లు కలలుగా కన్పించిన, ఊహలుగా అన్పించిన, భ్రమలుగా మిగిలిపోయిన కొన్ని మధురస్మృతులను ఆ రోజు కళ్ళముందు నిలవుకున్నారు సంయుక్త, కృష్ణ.

తనే స్వయంగా వండి కృష్ణ పక్కనే కూర్చుని వడ్డించింది సంయుక్త. ఎన్నో కబుర్లతో ఇద్దరూ కలిసి భోంచేశారు. ఇల్లంతా శుభ్రంగా సర్దేసింది. కృష్ణ బట్టలు మాసినవి తీసి ఉతికి ఆరేసింది.

మాట్లాడుతూనే చకచకా పనులు చేస్తున్న సంయుక్తని మురిపెంగా చూసుకుంటున్నాడు కృష్ణ.

తర్వాత...

ఇద్దరూ సినిమా చూసి వచ్చారు.

స్కూటర్ మీద అతని వెనకాల ఆనుకుని కూర్చుని రోడ్డు మీద దూసుకుపోతూ వుంటే అనిపించింది "ఈ క్షణం ఇలా నిలిచిపోతే బాగుండునని".

ఆ రాత్రి హోటల్‌లో భోంచేసి ఇంటికి చేరారు.

చాలాసేపు కబుర్ల తర్వాత పక్కల మీదికి చేరారు సంయుక్త, కృష్ణ.

ముందు గదిలో పడుకున్న కృష్ణకి నిదుర కరువైంది.

ఆ రోజంతా జరిగింది గుర్తుకు తెచ్చుకుంటే కృష్ణకి అదంతా కలలా అనిపించింది. సంయుక్తతో గడిపిన కాలం ఎంతో మధురంగా అనిపించింది.

ప్రేమికులుగా ఉన్నప్పుడు సంయుక్త, తాను ఆనందంగా గడిపేరు. ఎంతో చేరువగా వుండే సంయుక్తని ఆవేశం పట్టలేక కృష్ణ ఎప్పుడైనా చొరవ చూపితే సంయుక్త వారించేది.

"ముందు ముందు రోజులన్నీ మనవే" అనేది.

ఆమె అందాన్ని చూస్తూ ఆగలేక మాట్లాడబోతే...

"తొందరెందుకు! ఈ అందమంతా నీ సొంతమేగా?" అనేది. కానీ...

"అనుకున్నామని జరగవు అన్నీ"

"అనుకోలేదని ఆగవు కొన్ని" అని ఎవరో అన్నట్లు...

సంయుక్త, కృష్ణ దంపతులు కాలేకపోయారు. ఎవరికెవరో అయ్యారు. భార్యతో సంసార జీవితం సాగిపోతున్నా... కృష్ణకి ఏదో ఒక క్షణాన సంయుక్త గుర్తుకు వచ్చేది. జీవితంలో ఒక్కరోజైనా, ఒక్కసారైనా సంయుక్తతో గడిపే అవకాశం వస్తుందా?... ఇక రాదేమో? అని బాధగా నిట్టూర్చేవాడు. కానీ...

ఏ దేవుడో కరుణించినట్లు ఈ రోజు జీవితంలో మరుపురాని రోజు. ఇద్దరూ చేరువగా గడిపే అవకాశం వచ్చింది. ఎంత సమయం గడుస్తున్నా కృష్ణకు కంటి మీద కునుకు రాలేదు. కనులు మూసినా తెరిచినా సంయుక్త రూపమే అతని కళ్ళముందు నిలుస్తుంది. ఎన్నోసార్లు అనుకునేవాడు... సంయుక్త అందమైన శరీర లావణ్యం తనివితీరా తాకాలని, ఆ అందం స్వంతం చేసుకోవాలనుకున్నాడు.

సంయుక్త మరెవ్వరో కాదు...

తన ప్రాణం... తన సర్వస్వం అనిపిస్తుంది.

ఆమెకు దూరంగా ఉండలేక పోతున్నాడు.

పైకి లేచాడు కృష్ణ.

బెడ్‌రూంకి వచ్చాడు. మంచం దిక్కు చూశాడు.

బెడ్‌లైట్ కాంతిలో...

**సంయుక్త, కృష్ణ దంపతులు కాలేకపోయారు. ఎవరికెవరో అయ్యారు. భార్యతో సంసార జీవితం సాగిపోతున్నా... కృష్ణకి ఏదో ఒక క్షణాన సంయుక్త గుర్తుకు వచ్చేది. ఒక్కసారైనా సంయుక్తతో గడిపే అవకాశం వస్తుందా?**



మంచం మీద పక్కకి ముడుచుకుని పడుకుని వుంది సంయుక్త.

మెల్లిగా ఆమె దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు.

మరోమారు ఆమెను చూశాడు.

సన్నని దీపకాంతిలో వంపులతో దిద్దుకున్న రూపం అతన్ని వశం తప్పేట్టు చేస్తుంది.

ఆగలేని అతను... ముందుకు... ఆమె మీదకు వంగాడు. నుదుటున పెట్టిన కుంకుమ చూశాడు... ఒక్క క్షణం... ఏదో సంశయం... తల విదుల్చుకుని... మళ్ళీ ముందుకు చేయిపోనిచ్చాడు.

చెదరిన పమిట ఉండవలసిన చోటుని దాటి ఇవతలకు వచ్చింది.

ఆ చోట అతని చూపు ఆగిపోయింది.

అతని కళ్ళముందు మెరుస్తూ కనబడ్డాయి అవి.

ఆ రెండింటినీ చూడగానే అతనిలో సంచలనం కలిగింది. అతనిలో సన్నని కంపన మొదలైంది. సంఘర్షణకి గురైంది అతని మనసు. తాను చేసేది ఏమిటన్న ఆలోచన అప్పుడు అతనిలో మెదిలింది. సంస్కారం అతన్ని తట్టి లేపింది.

ముందుకు వెళ్ళిన చేయి, చెదిరిన పమిటను సరిగ్గా గుండెల మీద కప్పింది. ఆ పమిట చాటున... ఆ గుండెల మధ్య భద్రంగా అమరి వున్నాయి మెరుస్తూ రెండు బంగారపు మంగళసూత్రాలు.

వెనుతిరిగిపోతున్న అతని మదిలో ఎందుకో అంతులేని తృప్తి కలిగింది.

అతను అనుకున్నాడు మనసులో మనస్ఫూర్తిగా...

సంయుక్తా... నువ్వంటే నాకెంతో ఇష్టం. నావల్ల నీవు మలినపడకూడదు... క్షణికమైన ఆనందం కోసం జీవితాంతం బాధపడేట్టు చేయలేను... నీ సుఖమే నే కోరుకున్నా..."

*